క్లుప్తంగా

పది విద్యార్థులకు నగదు పురస్కారాల ప్రదానం రేపు

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు కోర్శిపాటి హరినారపరెడ్డి శనివారం తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడు మద్దుల నరసింహం వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా పాఠశాల తరుపున రూ.6 లక్షలు డిపాజిట్ చేశారని చెప్పారు. ఈ నగదుపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ. 15వేలు, రూ.10 వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి డిపాజిట్ నగదును పెంచి 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

జలదంకి: మొహర్రం కార్యక్రమాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జలదంకి ఎస్సై లతీఫున్నీసా సూచించారు. శనివారం ఎస్సై మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశం

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాగర్ ఆరోపించారు. నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ పట్టించుకోవడంలేదని విమర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారుఖ్, నగరాధ్యక్షుడు ఆశిర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్, మస్తాన్, నవీన్, సుబ్బు, హర్ష, లోకేశ్ పాల్గొన్నారు.

రమణారెడ్డి సేవలు ఎనలేనివి



సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్య శాఖలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా ఏనుగు రమణారెడ్డి ఎనలేని సేవలను అందించారని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందనున్న ఆయన్ను సంతపేటలో శనివారం సత్కరించిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి నేతగా రమణారెడ్డి ఎదగడాన్ని అభినందించారు. ఆయన శేషజీవితం హాయిగా సాగాలని కాంక్షించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో హంస ఆఫీస్ బేరర్లకు ప్రాధాన్యం కల్పించిన డీఎంహెచ్‌ఓ సుజాత, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలను సుధాకర్‌రావు తెలియజేశారు. హంస జిల్లా సెక్రటరీ కమల్‌కిరణ్, గౌరవాధ్యక్షురాలు ఇందిర, నేతలు మజరుల్లా, ఏటూరి జయశ్రీ, గౌస్‌బాషా, ఖాదర్ మస్తాన్, పరిమళ, అరవ కుమారి, వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కల్పం శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. హెచ్‌ఎం సుజాత బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌మీటర్ల వలన విద్యుత్ బిల్లుల్లో తేడాలు వస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకమరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వదిలేశారు

- పంచాయతీరాజ్ శాఖ నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన గోదాములు
- కోట్లాది రూపాయల విలువైన ఆస్తి నిర్వీర్యం



శిథిలావస్థకు చేరిన పంచాయతీరాజ్ శాఖ గోదాములు

ఆత్మకూరురూరల్: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద ఉన్న పంచాయతీరాజ్ శాఖకు చెందిన గోదాములు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ గతంలో 80 సెంట్ల విస్తీర్ణంలో గోదాములను నిర్మించారు. వాటిపై పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణ కొరవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరాయి. క్రమంగా గోదాముల ప్రాంతం ముళ్ల చెట్లతో నిండి అసాంఘిక కార్యకలాపాలు, విషసర్పాలకు నిలయంగా మారడంతో పక్కనే నివాసం ఉంటున్న ప్రజలు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలకు వచ్చే వారు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై సాక్షిలో పలు పర్యాయాలు కథనాలు వచ్చినా ఆ శాఖ అధికార యంత్రాంగం స్పందించలేదు. ఇటీవల మండలానికి చెందిన ఓ నాయకుడి కోరిక మేరకు ఎట్టకేలకు ముళ్ల చెట్లను తొలగించారు. కాగా ముంబై జాతీయ రహదారి పక్కనున్న స్థలాల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం పంచాయతీరాజ్‌కు చెందిన గోదాములు ఉండే స్థలం కోట్లాది రూపాయల విలువ పలుకుతుంది. అంతటి విలువచేసే ఈ స్థలాన్ని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు నిరుపయోగంగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీరాజ్ విభాగంలో గ్రామీణ స్థాయిలో చేపట్టే పనులను పర్యవేక్షించేందుకు రెగ్యులర్ డివిజన్ విభాగం ఉండగా, కేంద్ర ప్రభుత్వం సహకారంతో మంజూరయ్యే రోడ్ల పర్యవేక్షణ కోసం ప్రాజెక్ట్ విభాగం విడిగా పనిచేస్తోంది. అయితే ప్రాజెక్ట్ విభాగం ఆత్మకూరు డివిజన్‌లో ఇప్పటి వరకు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని పనిచేసిన దాఖలాలు లేవు. నెల్లూరులోని పంచాయతీరాజ్ కార్యాలయం నుంచే సంబంధిత ఇంజనీర్లు అందరూ శాఖాపరమైన వ్యవహారాలు నడిపిస్తుంటారు. ఆత్మకూరు పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్ట్ విభాగానికి కార్యాలయం లేక అధికారులు క్షేత్ర స్థాయిలో చేయాల్సిన పనులను సకాలంలో చేయలేకపోతున్నారు. నెల్లూరుపాళెం వద్ద ఉన్న పంచాయతీరాజ్ శాఖ గోదాముల స్థలాన్ని వినియోగించుకుని భవనాలు నిర్మించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంప్రదాయబద్ధంగా ఆషాడం సారె సమర్పణ



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు



సారెను మహిళలతో కలిసి ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి (జలదంకి): కావలి పట్టణంలో కొలువైన కళుగోళ సాంభవి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ఆషాడం సారెను శనివారం సమర్పించారు. చీరాలకు చెందిన భ్రమరాంబికా సేవా సమితి, కావలి సేవాబృందం ఆధ్వర్యంలో మహిళా భక్తులు లతా థియేటర్ వద్ద ఉన్న గంగమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా సారెను తీసుకొచ్చి కళుకోళ సాంభవి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపట్నుంచి ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమాలు

కావలి(జలదంకి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జూలై 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కావలి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి శనివారం తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం–ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు బృందగానం, సోలో, గ్రూప్‌డ్యాన్స్, చిత్రలేఖనం, లఘునాటిక, తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 17 ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్నవారు జూనియర్ విభాగం, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు సీనియర్ విభాగంగా పరిగణించనున్నట్లు తెలిపారు. విజేతలకు 6వ తేదీ బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

అంగన్‌వాడీలు సమయాన్ని పాటించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

మర్రిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయాన్ని పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే నారాయణమ్మ అన్నారు. మర్రిపాడు పీహెచ్‌సీలో మర్రిపాడు సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీకార్యకర్త, ఆయాలు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. పిల్లల డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వివరాలు సమానంగా ఉండాలన్నారు. మర్రిపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ అప్పాజీ, ఎంఈఓ తోట శ్రీనివాసులు అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సీఆర్‌ఎంటీలు, సచివాలయ వెల్ఫేర్‌అసిస్టెంట్లతో శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లోని బడిఈడు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతిలో కొత్తగా 281మంది చేరడం సంతోషకరమన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలన్నారు .

బస్సుల ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి



ఆత్మకూరురూరల్: ఆర్టీసీ బస్సుల ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పనిచేయాలని ఆత్మకూరు డీఎం శివకేశ్‌యాదవ్ అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో నూతన మేనేజరుగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన కార్యాలయంలో ఆర్టీసీ గ్యారేజీకి చెందిన వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు చెక్‌చేస్తూ మంచికండీషన్‌లో ఉండేలా చూడాలన్నారు. ఏఎంఎఫ్ బాబురావు, ఉద్యోగులు హయత్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

ఉదయగిరి: ఎస్సీ కార్పొరేషన్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) శిక్షణా కేంద్రంలో డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు ఆ కేంద్రం నిర్వాహకులు ఎల్ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఎస్సీలు అర్హులని చెప్పారు. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరుగుతుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, స్టేషనరీ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 91773 27797 నంబరును సంప్రదించాలని కోరారు.

అచ్చమాంబ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ గంగాధర్

మర్రిపాడు: అచ్చమాంబ పేరంటాళ్ల తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. శనివారం ఆయన పొంగూరులోని అచ్చమాంబ ఆలయం వద్ద తిరునాళ్ల భద్రత ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సైకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

అల్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని జూలై 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ శనివారం తెలిపారు. అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

డీసీపల్లిలో 570 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 570 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 839 బేళ్లు రాగా, 570 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.202.18 ధర పలికిందని వివరించారు. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 336 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 489 బేళ్లను తీసుకురాగా, 336 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సరాసరిన రూ. 214.56 ధర పలికిందని వివరించారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

వైభవంగా నాగార్పమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో నాగారప్పమ్మ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతి పూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని వనంలో సామూహిక పొంగళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి కలిగిరమ్మ తిరునాళ్ల

కలిగిరి: కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లను ఆదివారం నుంచి గురువారం వరకు వైభవంగా నిర్వహించనున్నారు. తొలిరోజు ఆదివారం అమ్మవారి ఆలయం ఎదుట సుడిమానును నిలిపి తిరునాళ్లకు అంకురార్పణ చేస్తారు. రెండో రోజు సోమవారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పాపనముసిలిపాళెంలో విశేష పూజలు నిర్వహిస్తారు, అనంతరం గ్రామోత్సవంగా అమ్మవారిని మెట్టినిల్లు అయిన జిల్రావారిపాళేనికి చేరుస్తారు. మూడోరోజు మంగళవారం జిల్రావారిపాళెంలో విశేషపూజలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. నాల్గోరోజు బుధవారం అమ్మవారిని కలిగిరికి చేరుస్తారు. తిరునాళ్ల ముగింపు సందర్భంగా గురువారం కలిగిరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పిస్తారు. మధ్యాహ్నం ఆలయం చుట్టు బండ్లు తిప్పుతారు. చివరిగా సుడిమానును తిప్పి తిరునాళ్లను ముగిస్తారు. వేలాది మంది భక్తులు తరలి వస్తుండడంతో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



ఆత్మకూరు: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సరఫరాను అందించేందుకు విద్యుత్ శాఖ కృషి చేస్తోందని ఆత్మకూరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం భానునాయక్ అన్నారు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట జాతీయ విద్యుత్‌భద్రత వారోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం డీఈఈ విద్యుత్ సిబ్బందికి భద్రతా వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన మెళకువలు, ప్రమాదరహితంగా విద్యుత్‌ను వినియోగించుకోవడం, భద్రతా పరికరాలు ఉపయోగించడం, సౌర్యవిద్యుత్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. ఏడీఏ చిన్న స్వామి నాయక్, ఏఈ జమీల, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థ



బస్‌షెల్టర్ లేక చెట్టు కింద నిల్చుని ఉన్న ప్రయాణికులు

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలోని హజరత్‌ఖాజానాయబ్ రసూల్ వారి దర్గాకు ప్రతినిత్యం దేశ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. అలాగే ఏఎస్‌పేట పరిసర గ్రామాలకు చెందిన వారు నిత్యం వివిధ అవసరాల కోసం వస్తుంటారు. అయితే బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండకు, వానకు దుకాణాల కింద తలదాచుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి అన్ని ప్రణాళికలను సిద్ధం చేశారు. అంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో ప్రణాళికలు మరుగున పడ్డాయి. పర్యాటక, పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం వెంటనే ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్‌లో అన్ని వసతులతో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శరవేగంగా ఉత్తరకాలువ విస్తరణ పనులు



కలిగిరి వద్ద చేపట్టిన ఉత్తర కాలువ విస్తరణ

ఉదయగిరి: కలిగిరి మండలంలో ఉత్తర కాలువ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లోని మెట్ట మండలాలకు సోమశిల జలాలను అందించే గొట్టిపాటి కొండపనాయుడు కాలువ (ఉత్తరకాలువ) విస్తరణ పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు మంజూరు చేశారు. ప్రస్తుతం కాలువ కెపాసిటీ 6 క్యూసెక్కులు ఉండగా, దానిని 13 క్యూసెక్కులకు పెంచేందుకు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కాలువ విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే రాళ్లపాడు ప్రాజెక్టుకు కూడా నీరు వేగంగా చేరుకుంటుంది.

ప్రజాసేవలో మమేకం కావాలి



ఆత్మకూరురూరల్: మహిళా సర్పంచ్‌లు రాజకీయంగా చైతన్యవంతులై ప్రజాసేవలో మమేకం కావాలని శిక్షకులు శ్రీవిద్య, జిలానీబేగ్ సూచించారు. ఆత్మకూరు డివిజన్ స్థాయిలో మహిళా సర్పంచ్‌లకు ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ మహిళా సర్పంచ్‌లు తమ కుటుంబ సభ్యుల పెత్తనం లేకుండా స్వయంగా ప్రజల అవసరాలను తీర్చేలా ముందుకుసాగాలన్నారు. అనంతరం ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించడం, ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇచ్చారు.

మార్కెట్ దారికి మరమ్మతులు చేపట్టాలని వినతి



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని కూరగాయలు, మటన్, చికెన్, విక్రయాలు చేసే మార్కెట్ లోపలికి వెళ్లే దారికి మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బస్టాండ్ నుంచి మార్కెట్‌లోకి ప్రవేశించే దారి రోడ్డు కంటే ఎత్తుగా ఉండడంతో వాహనాలు లోపలికి వెళ్లడం కష్టంగా మారింది. అదే క్రమంలో మార్కెట్‌లోకి వెళ్లే వారు ఆ దారి వెంట వెళ్లి ప్రవేశ ద్వారం వద్ద ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తకు సన్మానం



ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ శాస్త్రవేత్త మిట్ట చిన్నఓబయ్య ఉద్యోగ విరమణ సభను శనివారం నిర్వహించారు. ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఆయన నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా చిన్న ఓబయ్యను అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.